33

# సెలెక్షన్

సుందర సాయంత్రం –

చల్లగాలి వీస్తూ ఉన్నది ;; అక్కడక్కడ మబ్బులు పట్టి ఉంది ఆకాశం!

అది ఒక కాలనీ కాబట్టి నగర జీవితపు రణగొణ ధ్వనులు లేవు.... దుమ్ము ధూళి లేవు – పొగ కాలుష్యం అసలే లేదు.

భుజంగ రావు సాయంత్రపు నడక నడుస్తున్నాడు.

అతను నడుస్తూంటే రోడ్డు రోలరు దొర్లుతున్నట్లు ఉంటుంది. భారీ కాయం – బొజ్జముందుకొచ్చింది.... బుర్రమీసాలు – దుస్తులు బాగా బిర్రుగా అయిపోయాయి.

ఆయాసపడుతూ నడుస్తున్న అతనికి ఎదురుగా ఒక బక్క ప్రాణి "గుడీవినింగ్ సార్!" అంటూ ప్రత్యక్షమయింది.

ఆగి, జారిపోతున్న కళ్ళజోడులోంచి తీక్షణంగా చూశాడు.

"ఏంకావాలి !" గొంతులో కొంచెం కర్కశత్వం వినిపించింది.

"ఏం లేదు సార్ – ఏం లేదు –" తడబడ్డాడు బక్క ప్రాణి

"డొనేషన్లు అడిగేవాళ్లన్నా – అడుక్కుతినే వాళ్ళన్నా నాకు అసహ్యం! నేనెవరికీ నయాపైసా దానం చెయ్యను." నిర్మొహమాటంగా చెప్పాడు.

బక్క ప్రాణికి అనుమానం వొచ్చి తన దుస్తుల వంక చూసుకున్నాడు – అంత చెత్తగా అయితే లేవు.

"అస్సలు ఇండియా చెడిపోవడానికి కారణం ఎవరనుకున్నావు – ఈ బద్ధకస్తుల వల్లనే ! అప్పనంగా వస్తే తిందామనే !"

"సార్ ! మీరు నన్ను గుర్తు పట్టలేదా?"

"ఎందుకు గుర్తు పట్టాలి ! నువ్వేమన్నా అబ్దుల్ కలామ్‌వా ? రజనీ కాంత్‌వా – ఘంటసాలవా ?" చికాగ్గా అడిగాడు వాడితో తనకు మాటలేమిటన్నట్లు మొహం పెట్టి.

"కాదండి – కాని నన్ను తమరు గుర్తు పట్టలేదు."

"కొంప దీసి – టీవి యాంకరువా – రోడ్డుమీద 'ఓ సాయంత్రం' లాంటి ప్రోగ్రాం కాని తీస్తున్నావా?" గాబరగా అటూ యిటూ చూశాడు.

" కొంచెం ఆలోచించండి సార్ !" చిరునవ్వుతో అన్నాడు.

" అంటే నాకు ఆలోచించడం రాదనా నీ ఉద్దేశ్యం ? ఆలోచించడం రాకుండానే ఇంత ఎత్తుకు ఎదిగాననా నీ ఆలోచన?" తీవ్రంగా చూస్తూ కోపంగా అరిచాడు.

బక్క ప్రాణి భయపడి పోయింది.

" సార్ ! అదికాదు సార్ – నేను మీ క్రింద పని చేస్తున్నా సార్!"

భజంగం తలవంచి క్రిందకు చూశాడు – అక్కడ ఎవరూ కనిపించలేదు. మళ్ళీ తలపైకెత్తి చూశాడు అతని కళ్ళలోకి.

" నేనంత వెర్రి వెంగళప్పలా కనిపిస్తున్నానా నా క్రింద పని చేస్తున్నానంటే నమ్మడానికి."

గుడ్లురిమాడు భుజంగం

" నా ఉద్దేశ్యం ఏంటంటే సార్ ... నేను మీ ఆఫీసులోనే పని చేస్తున్నా సార్ – మీరు నా బాసు – చిరుద్యోగిని!" అంటూ తను ఎక్కడ ఏసీట్లో పని చేస్తున్నది వివరించాడు.

" నాపేరు గురునాథం అని మీకు గుర్తుండే ఉంటుంది."

బుర్ర మీసాల భుజంగం గంభీరంగా తలాడించాడు. ఈ మధ్య అతగాడు బదిలీ మీద ఇక్కడి ఆఫీసుకు వచ్చాడు – స్టాఫుతో యింకా సాన్నిహిత్యం ఏర్పడలేదు పూర్తిగా.

" ఆ ముక్క ముందే చెప్పి ఏడ్వవచ్చుగా" స్వగతంగా అనుకున్నా – బయటకు వినిపించింది.

" అలా కాదు సార్ ముందే చెబితే – నాకేం కళ్ళు నెత్తిమీద కొచ్చాయా – ఆ మాత్రం తెలీదా అని తిడతారేమోనని భయపడ్డా!" నసిగాడు.

" ఏంటో వెతుకుతున్నావు – మీఇల్లు కాని తప్పిపోయిందా?"

" లేదు సార్ – మీ ఇల్లు గురించే ఎంక్వయిరీ చేస్తున్నా – ఈ లోగా తమరి దర్శనం అయింది." వినయంగా చెప్పాడు గురునాథం.

" మీ ఇల్లెక్కడ ?"

" సంతోష నగర్ కాలనీలో"

"అదెక్కడ ?"

"వెంకటరమణ కాలనీ దాటి కొంచెం ముందుకు పోవాలి ఇలా పోతే – లేదా హైవేలో పోతే ఇక్కడికి ఐదు కిలోమీటర్లు."

" ఇంతకీ యివన్నీ నాకెందుకు చెబుతున్నావయ్యా ! ఏదో నాపాటికి నేను వాకింగ్ చేసుకుంటూ పోతూంటే – సైంధవుడిలా అడ్డుపడ్డావు!"

" అతనెవరు సార్ !" కుతూహలంగా అడిగాడు గురునాథం.

" మా బావమరిది!" చెప్పాడు విసుగ్గా – భుజంగం.

" అతనికెప్పుడూ అడ్డుపడటమే అలవాటా సార్!" అనుమానించాడు.

" ఇంతకీ నువ్వొచ్చిన పని చెప్పు." వాచీ చూసుకుంటూ అడిగాడు.

" రోడ్డుమీద బాగుండదు సార్ – అలా మీయింటికెళ్ళి మాట్లాడుకుందాం!" రెండు చేతులు కట్టుకుని ప్రార్థించాడు.

భుజంగం బుసలు కొట్టి తలాడించాడు...

కాసేపటికి గేటు తెరుచుకుని వరండాలోకి వచ్చారు.

ఆ శబ్దానికి లోపల నుంచి ఓ భారీ కాయం, సరిగా చెప్పాలంటే భుజంగంకు ఒకటిన్నర రెట్లు సైజులో, వరండాలోకి ప్రవేశించింది – ఆపసోపాలు పడుతూ. బక్క ప్రాణి గురునాథం కొంచెం షాక్ తిన్నాడు.

" మా ఆవిడ – సుందరమ్మ !" చెప్పాడు భుజంగం

" అమ్మగారు కాస్త ఒళ్ళు చేసినట్లున్నారు – " అనాలోచితంగా అన్నాడు.

" అబ్బే ! ఈ మధ్య బాగా చిక్కిపోయింది – బాగా డైటింగ్ కూడ చేస్తున్నది." భుజంగం చెప్పాడు సుందరమ్మను ప్రేమగా చూస్తూ ; 'ఓర్నాయనో' అనుకున్నాడు గురునాథం, ఆమె పూర్వపు ఆకారాన్ని ఊహించుకుంటూ.

" మేడం గారు – ఇవి మావూళ్ళో ప్రసిద్ధమైన స్వచ్ఛమైన నేతి మిఠాయిలు, మీ కోసమే తీసుకొచ్చాను." అంటూ బ్యాగులోంచి తీసి ఓ కిలో స్వీట్లు యిచ్చాడు.

"ఇప్పుండెందుకోయ్ యివన్నీ – నో ఫార్మాలిటీస్ – " భుజంగం చెప్పాడు.

" కాఫీ తెస్తాను – " చెప్పింది ఆమె.

" అయ్యో ! ఇప్పుడే తీసుకొచ్చాను - కాని మీరిస్తానంటే వద్దనకూడదు - టీ అయినా ఫర్వాలేదు." చెప్పాడు గురునాథం.

" గురునాథం - నాకు ఇంకా కొత్తగానే ఉందయ్యా ఆఫీసు - వచ్చి వారమేగా అయింది... అందరూ బాగా పని చేస్తున్నారా?"

" చెయ్యకపోతే తమరు ఊరుకుంటారా ? వాళ్ళ చర్మం ఒలిచి చెప్పులు కుట్టించుకోరూ - " పొగుడుతూ చెప్పాడు.

" ప్రాబ్లం ఉన్న ఆఫీసనీ పైవాళ్ళు నన్ను ఏరికోరి యిక్కడ వేశారు - నా సంగతి మీకు తెలియదు - తేడా లొస్తే తాట తీస్తా - ఒక్కోడ్ని ఇచ్ఛాపురం పంపిస్తా!" బుసలు కొట్టాడు భుజంగం.

సుందరమ్మ సుందరంగా దొర్లుకుంటూ దొర్లుకుంటూ నడుచు కుంటూ వచ్చి కాఫీలు అందించింది... వాళ్ళిద్దరికి - తనొకటి తీసుకుని సోఫాలో కూర్చుంది.

" ఈ ఊరు నాకేం నచ్చలేదు - ఇక్కడి వాతావరణం - కల్చరు అస్సలు బాగాలేదు ఏంటి - రోడ్డుకడ్డంగా గాడిదలు నిలబడి పోతుంటాయి - ఇక్కడ వున్నన్ని గాడిదల్ని మేము ఏ ఊళ్ళో కూడ చూడలేదు - " చెప్పింది.

" చూసే ఉంటారు - కాకపోతే వాళ్ళు కాస్త రూపం మార్చుకుని - మనుషుల్లా కన్పించి ఉంటారు - " గురునాథం చెప్పాడు.

" నిజమే గాడిదలు ఎక్కడైనా ఉంటాయి - అవి కామరూపధారులు !" భుజంగ చెప్పాడు. "ఆమాట కొస్తే మన ఆఫీసులో కూడా ఉన్నాయని నా నమ్మకం!" కొంచెం వంకరగా చూస్తూ చెప్పాడు.

" అసలు గాడిదల పూర్వజన్మ మీకు తెల్సా సార్ ! అవి ఋషి పుంగవులట! అందుకే మీరు హారన్ కొట్టినా కాని - అదిలించినా కాని - వర్షం వచ్చినా - ఎండలు మండి పోయినా తదేక ధ్యానంతో రోడ్డు మధ్యగా ఉండి పోతాయి." గురునాథం చెప్పాడు.

సుందరమ్మకు నవ్వు వచ్చింది .... 'హో హో ' అని నవ్వింది. పిడుగులు పడుతున్నా యేమోనని భయపడ్డాడు గురునాథం.

" ఇంతకీ నువ్వొచ్చిన పనేంటో చెప్పలేదు - " అడిగాడు పైకి లేస్తూ.

"అబ్బే! ఏం లేదు సార్ –– ఓ వారం రోజుల్లో సూపర్ వైజర్ పోస్టుకు ఇంటర్వ్యూలు వస్తున్నాయని మాకు సమాచారం అందింది. ఆన వాయితీగా మన ఆఫీసుకు ఒకటో రెండో ప్రమోషన్లు ఇస్తారు. దానికి నేను మిక్కిలి తగిన వాడ్ని! మోస్టు ఎలిజిబుల్ క్యాండిడేట్‌ను. అందుకని తమరు నా పేరు రికమెండేషన్ చేస్తే – మిమ్మల్ని కాదని ఎవరూ వేరే వాళ్ళకివ్వలేరు" చెప్పాడు.

"ఇంతకీ యిక్కడ నుంచి ఇంటర్వ్యూకి ఎంత మంది పోతారు?"

"ఓ పది మంది దాకా ఉంటారు సార్!"

"నువ్వేనా సీనియరు మోస్టువి – లేదా జూనియర్ మోస్టువి?"

"రెండూ కాదు సార్ – మధ్యరకం సర్వీసు నాది ....అందుకే మిమ్మల్ని ప్రార్థిస్తున్నా
సార్ ... కొంచెం నా పేరు గుర్తు పెట్టుకుని –" చెప్పడు గురునాథం.

"అట్లానా – చూద్దాం – అప్పుడు గుర్తు చెయ్యి" ముందుకు కదిలాడు.

"అట్లా కాదు సార్ – మీరిప్పటి నుండే పైవాళ్ళకు చెప్పి వేరే వాళ్ళకు యివ్వకుండా చూడండి సార్ –"

"చూస్తాగాని – అయితే నాకేంటి లాభం?" భుజంగం పాయింటు కొచ్చాడు.

"మీ రుణం తీర్చుకోలేను సార్!"

"అంటే ఎగ్గొడతావా?"

"అబ్బబ్బె! అది కాదు సార్... తప్పకుండా తీర్చుకుంటా సార్!"

"ఏమండీ! మనం పోయి కూరగాయలు తెచ్చుకోవాలి..." గుర్తు చేసింది సుందరమ్మ.

"సర్లేవయ్యా – అప్పుడు కనపడు – ముందు మేం కూరగాయల కోసం పోవాలి – బొత్తిగా అయిపోయాయి –" ద్వారం దగ్గరికి నడిచాడు పొమ్మనలేక.

"అయ్యో! ఇంత చిన్నపనికి మీరు పోవాలా సార్ – నేను తెస్తాను – సంచీ నాకివ్వండి." దొరికిన అవకాశాన్ని వదులుకోదల్చుకోలేదు.

"ఛ ఛ! బావుండదయ్యా – మా కూరగాయలు నువ్వు తీసుకురావడమేంటి?"

"దీంట్లో ఏముంది సార్ – ఎలాగూ మాయింటికి కొనుక్కోవాలి – దాంతో

పాటే మీవి తెస్తాను."

"సరే బాబు ! తీసుకురా !" అంటూ చిన్నలిస్టుయిచ్చింది సుందరమ్మ.

భుజంగం జేబులో చెయ్యి పెట్టి డబ్బు లియ్య బోతే "భలే వారే – ఉంచండి సార్!" అని మార్కెట్టుకు బయలు దేరాడు.

అలవాటు లేని పని – ఇంటికి కూడ ఎప్పుడూ కొనడు – అన్నీ సుబ్బలక్ష్మి చూసుకుంటుంది. ఎప్పుడన్నా 'ఏవండీ ! కూరలు అయిపోయాయి – వచ్చేప్పుడు తెస్తారా !' అంటే 'అంత కంటే నాకింకేం పని లేదనుకున్నావా? నాన్సెన్సు ! నువ్వు ఇంట్లో ఊరకే కూర్చునుండేదే కదా – నువ్వే తెచ్చుకో!' అని కసురుకునే వాడు.

సంచినిండా కూరలతో మోయలేక మోయలేక బయట కొచ్చాడు – ఆటో కోసం ఎదురు చూస్తూ నిల్చున్నాడు – మార్కెట్టు ముందు.

"ఏమండోయ్ ! ఇక్కడున్నారేంటి!" ఆశ్చర్యంగా అడిగింది సుబ్బలక్ష్మి.

గొంతులో పచ్చి వెలక్కాయ పడింది. 'దీని దుంప తెగ ! ఇది ఇప్పుడే రావాలా మార్కెట్టుకు'. అని మనసులో తిట్టుకున్నాడు.

"అరె – మీరు కూరగాయలు కొనుక్కొస్తున్నారా – థ్యాంక్యూ సోమచ్ ! నాకు పని తగ్గించారు – " ఆనందంగా అరిచింది.

"నీ బొంద ! మనక్కాదే యివి – మా బాసుకు – " తలొంచుకుని చెప్పాడు.

సుబ్బలక్ష్మి షాక్ తింది – తీక్షణంగా చూసింది.

"ఎప్పటినుంచి యిలా ఆఫీసరింటికి కూరగాయలు మోసుకెళుతున్నారు? ఇది మీరు చెయ్యాల్సిన పనేనా? మీరు చదివింది ఏంటి? చేస్తున్న ఉద్యోగమేంటి – నేనెప్పుడన్నా అడిగినా తీసుకురాలేదే ! ఆఖరికి అత్తయ్యగారు మామయ్య గారు అడిగినా తెచ్చేవాళ్ళు కాదే – ఇదేంటి యిలా తయారయ్యావు గుర్నాథం!" ఆశ్చర్యంగా బాధగా అడిగింది.

"ఒసే నిన్ను తగలెయ్యా ! కాస్త నోరు ముయ్యవే ! అందరూ మనల్నే చూస్తున్నారు." కంగారు పడి పోయాడు.

"చూడనివ్వండి – కళ్ళు మూసుకుని పిల్లి పాలు తాగుతూ తనని ఎవరూ చూడ్డం లేదనుకొంటుందిట ! మిమ్మల్ని యింకెంత మంది చూశారో ! ఇందాక మీ

కొలీగ్ సుబ్బారావు ఇటు పోగా చూశాను. ” చెప్పింది

గురునాథం పూర్తిగా కంగారుపడిపోయాడు

“ సర్లేవే –– నేను అరగంటలో వస్తాను – నువ్వెళ్ళు !” అంటూ వచ్చిన ఆటోలో ఎక్కి కూర్చున్నాడు – మళ్ళీ యింకెవరికీ కనిపించకూడదని.

ఆ రాత్రి సుబ్బలక్ష్మి క్లాసు పీకింది గురునాథంకు.

తన నాన్న అమ్మలు అంతంత కట్నం తగలేసి యితనికిచ్చి పెళ్ళి చేసింది ఆఫీసర్లకు కూరగాయలు మొయ్యడానికి కాదని చెప్పింది. కొంచెం ఆత్మగౌరవంతో బ్రతకమంది.

“ దానికోసమేనే నా ప్రయత్నం – సూపర్ వైజరు పోస్టులు ఓ వారం లో తేలుతాయి – దాన్ని కొట్టేద్దామని . అందరూ ఆ సుబ్బారావుకు వస్తుందనుకుంటున్నారు – ఈ ఛాన్సు మిస్సయితే మళ్ళీ రెండు మూడేళ్ళకు కాని తగలదు – ప్లీజ్ ! ఇది మనసులో పెట్టుకోమాకు.” బ్రతిమాలు కున్నాడు.

ఇంటర్వ్యూకు పోయే ముందు కూడ పోయి కలిశాడు. ఇద్దరికీ మంచి కబుర్లు చెప్పాడు. మంచి స్వీటని బనారస్ కోవా ఓ కిలో యిచ్చాడు. “ సెలక్టయితే మంచి గిఫ్టు యిస్తానని” వాగ్దానం చేశాడు.

ఇంటర్వ్యూ బాగా జరిగింది. అడిగిన వాటికి చకచక సమాధానాలు చెప్పేశాడు కాని ఇంటర్వ్యూలో ఛైర్మన్ ఓ ప్రశ్న వేశాడు – “ఈ పోస్టు నీకు వస్తుందనుకుంటున్నావా? ఎలా – నువ్వు సీనియరువి కాదు కదా?” అని

“ సీనియర్‌కే యిచ్చేట్లయితే ఇంటర్వ్యూ నే అఖ్ఖర్లేదు కదా సార్ – డైరెక్టుగా ఆర్డర్లే పంపచ్చుగా.” అని లాజికల్‌గా చెప్పాడు గురునాథం.

“ పోనీ – నువ్వు టెక్నికల్ గా కూడ అన్నీ పాసు కాలేదు – క్వాలిఫికేషన్లలో – మార్కుల్లో నీకంటే ఎక్కువొచ్చిన వాళ్ళున్నారు – ” ఛైర్మెన్ మళ్ళీ అడ్డుతగిలాడు.

“ అందుకే గదా సార్ – ఇంటర్వ్యూ పెట్టింది. మార్కులు – క్వాలిఫికేషన్లు తెలివితేటలకు కొలమానాలు కావు గదా సార్ ! ఇంటర్వ్యూలో అయితే మీ లాంటి వాళ్ళకు మా లాంటి వాళ్ళను చూడగానే తెల్సిపోతుంది ఎవరు డిజర్వింగ్ కాండిడేట్ అని.” చెప్పాడు తొణక్కుండా బెణక్కుండా.

ఛైర్‌మన్ తలాడించి "ఆల్‌దిబెస్టు" అని చెప్పాడు.

పెద్ద తలకాయ టూరుకు పోవడం వలన రిజల్ట్సును వారంరోజులకు వాయిదా వేశారు ఇంటర్వ్యూ అయిపోయాక.

గురునాథంకు ఒకటే టెన్షను 'వస్తుందా ? రాదా?' అని.

భుజంగం చుట్టూ ప్రదక్షిణాలు చేశాడు చాలాసార్లు –

అతని కొచ్చిన కీలక సమాచారం ప్రకారం – భుజంగంకు పైన చాలా వెయిటుందని – ఉండదామరి – మనిషి నూరు కిలోలు పైన తూగు తాడు – తమ ఆఫీసు విషయములో ఆయనెవరి పేరు చెబితే వారికే ఆ పదవి వరిస్తుందని.

ఇంటర్వ్యూ కేవలం బూటకం అని – అందర్నీ తృప్తి పరచడానికి ఆడుతున్న జగన్నాటకమని ... రాని వాళ్ళు రేపొద్దున నిరుత్సాహపడి సరిగా పనిచెయ్యకుండా ఉండకుండా అడ్డుకోవడానికి కని – ఎందుకంటే ఇంటర్వ్యూలో ఎన్నో కష్టమైన ప్రశ్నలు అడుగుతారు – తమకు అక్కర లేని – ఇష్టం లేని అభ్యర్థి వస్తే ఎలాగూ అందరూ అన్ని ప్రశ్నలకు సమాధానం చెప్పలేరుగా –

రానివాడు నేను ఇంటర్వ్యూ బాగా చేయలేదు అందుకని రాలేదు – ఇంకోసారి బాగా నేర్చుకోవాలి అనుకుంటాడు.

వచ్చినవాడు తన ప్రతిభను సంస్థ గుర్తించింది – కాబట్టి యింకా బాగా పని చెయ్యాలనుకుంటాడు.

ఆ రోజు గురునాథం భుజంగం యింటికి పోయాడు – ఇంకోసారి పై వాళ్ళకు చెప్పమని అడుగుదామని.

వరండాలో కూర్చుని మాట్లాడుకుంటుండగా – లోపల్నించి బయటకొచ్చాడు సుబ్బారావు –

గురునాథంను చూసి సుబ్బారావు – సుబ్బారావును చూసి గురునాథం షాకయ్యారు.

తేరుకున్న తరువాత పలకరించుకున్నారు

"ఏంరా సుబ్రావు – లోపల ఏం చేస్తున్నావు?" వంకరగా అడిగాడు అతని ప్యాంటు – చొక్కా కాస్త తడిసి ఉండటం చూసి .

సుబ్బారావు కంగారు పడి సర్దుకున్నాడు " అర్జెంటుగా బాతురూముకు పోవాల్సివచ్చింది - అందుకని లోపలి కెళ్ళాను - అయినా నువ్వెందుకు ఈ టైంలో వచ్చావు !" సుబ్బారావు అడిగాడు.

" ఇక్కడ దగ్గరలో మా బంధువులున్నారు. బర్తుడే ఫంక్షనుంటే వచ్చాను - ఎలాగూ యింత దూరం వచ్చాను కదాని - సార్‌ను పలకరించిపోదామని వచ్చాను." గురునాథం కూడ సర్దుకున్నాడు.

" కూర్చుని మాట్లాడుకుంటూ ఉండండి - కాఫీ కలిపిస్తాను " అంటూ లోపలికి పోయాడు భుజంగం.

మిత్రులిద్దరూ శత్రువులకు మల్లే తీక్షణంగా చూసుకుంటూ వంకరనవ్వులు నవ్వుకుంటూ సైలెంటుగా కూర్చున్నారు.

ఇంతలో చిన్నగా లోపలనుండి మాటలు వినిపించాయి.

" ఏమేవ్ ! వాళ్ళకి కాస్త కాఫీ కలుపవా?"

" ఆ ! అదొకటే తక్కువ !"

" పాపం మనకోసం ఇద్దరూ బాగా కష్ట పడుతున్నారు - మనకు ప్రియ శిష్యులు !" వెనకేసుకొచ్చాడు భుజంగం.

" ఆ తెలుస్తూనే ఉంది ఇద్దరి తెలివితేటలు - చూడండి - ఈ అంట్లు ఎలా తోమాడో మీ ప్రియ శిష్యుడు - ఎంగిలి కూడా పోలేదు మళ్ళీ నే తోముకోవాలి -"

గురునాథం ఆశ్చర్యంగా సుబ్బారావు వంక చూశాడు.

" అరవకువే! వినిపిస్తుందేమో - అలవాటు లేని పనిగా -"

" అయినా వీళ్ళకు ఉద్యోగాలు ఏ గాడిద యిచ్చాడు ? మొన్నకు మొన్న అతనితో కూరగాయలు తెప్పించారు - అన్నీ ముదిరిపోయినవి - ఎండిపోయినవి - పుచ్చిపోయినవి తెచ్చాడు - దిబ్బలో పారేశాను."

" పోన్లేవే - ఆ డబ్బులు మనం ఇవ్వలేదుగా !"

సుబ్బారావు ఆశ్చర్యంగా గురునాథం వైపు చూశాడు.

" మళ్ళీ వీళ్ళు చేసే పనులకు ప్రమోషనొకటి ! థూ ! అయినా మిమ్మల్ని అనాలి - నేనయితేనా - " సుందరమ్మ క్లాసు తీసుకుంటుంది.

భుజంగం బయట కొచ్చాడు

" సారీ ! పాలు విరిగి పోయాయట – మీరు పోయి రండి – "

మిత్రులిద్దరూ బయట కొచ్చి ఎవరి దార్న వాళ్ళు పోయారు

ప్రమోషను రిజల్ట్సు వచ్చాయి, రెండు రోజుల తర్వాత.

గురునాథంకు రాలేదు.

అలా అని సుబ్బారావుకు కూడ రాలేదు

మోస్టు సీనియరు బాబా కు రాలేదు – టెక్నికల్ గా అన్నీ పాసైన అవధానికి రాలేదు. రాత్రింబగళ్ళు గొడ్డు చాకిరీ చేసే గోపాలరావుకు రాలేదు.

వచ్చింది ఎవరికంటే గిరిధర్‌కు ... జూనియర్ మోస్టు – నో క్వాలిఫికేషన్ – అంతే కాదు అతను పెద్ద·పనోడేం కాదు – పెద్ద రూల్సు తెలీవు – వర్కు తెలీదు.

కాని ప్యాంటు చొక్క నలగకుండా, నీటుగా కూర్చుని అలసి పోయినట్లు వీర ఫోజులిస్తూ ఉంటాడు – గురునాథం – సుబ్బారావులు నిశ్చేష్టులై పోయారు – రెండు రోజులు సెలవులు పడేశారు – బాధతో.

కోలుకున్న తర్వాత విచారణలో తేలింది ఏమిటంటే గిరిధర్ కులం భుజంగరావు కులం ఒకటేట!

గురునాథం – ఆయింటి గడప తొక్కలేదు మళ్ళీ !

( స్వాతి సపరివార పత్రిక 11-11-2005)